

# ధనలాభం

ఒకసారి ఓ జ్యోతిష్కుని దగ్గరకు ఒక జమిందారు చెయ్యి చూపి జోస్యం చెప్పించుకుంటూండగా, అక్కడికి ఒక బీద కుర్రాడు ఒకడు వచ్చాడు. జ్యోతిష్కుడు ఆ కుర్రవాడిని జమిందారుకి చూపించి, ''వీడి తండ్రి కూలీ చేసుకుని బ్రతుకుతున్నాడు. అయితేనేం? వీడికి త్వరలోనే గొప్ప ధనయోగం కలగబోతోంది! వీడివల్ల వీడి తండ్రి ఎంతో సుఖపడతాడు! ఇక వీడి తండ్రిని కష్టాలు తొలిగిపోయినట్లే!'' అన్నాడు.

''అలాగా! అతనికి అంతగా ధనం కలిసిరాబోతూందా?'' అన్నాడు మామూలుగా జమిందారు. కానీ మనసులో పేరాశ కలిగింది. వెంటనే, ఆ జ్యోతిష్కుడి మీద మంచి నమ్మకం ఉన్న ఆ జమిందారు ఆ కుర్రాడిని అనుసరించి వస్తూ అతని యిల్లు తెలుసుకుని, ''చూడు, నీ కొడుకుని నాకు దత్తత యిస్తావా, నీకు కావలసినంత డబ్బు, ఉండటానికి మంచి యిల్లు, కూలి చేయక్కర్లేకుండానే కూర్చుని తినే సదుపాయం— అన్నీ చేస్తా. నాకు కావలసిందల్లా నీ కొడుకు; కాదనక పిల్లలులేని నాకు దత్తత చేయ్! '' అంటూ కాళ్ళు పట్టుకు బ్రతిమిలాడాడు. ఆ కూలివాడు భయంతో ''మీరు తమాషా చేస్తున్నరా?'' అనడిగాడు.

''అదేంలేదు నా మనసుకు యింతవరకూ ఏ పిల్లాడూ నచ్చలేదు; పూర్వ జన్మలో వీడు నా కొడుకేమో తెలీదుకానీ, నాకు పితృ అనుభూతి కలిగింది. వీడినే పెంచుకోవాలని అనుకుంటున్నాను!'' అంటూ బ్రతిమిలాడాడు. కూలివాడి భార్య తమకు రాచరికం కలుగుతోందన్న ఆనందంతో - సవతి కొడుకే కదా- అని, ''తీసుకెళ్ళండి బాబూ!'' అంది. జమిందారు అన్న ప్రకారం అన్నీ సమకూర్చి, ఆ కూలివాడిని గొప్పవాడిని చేసి, ఆ పిల్లాడ్ని ''లక్ష్మీకుమారా!'' అంటూ కొత్తపేరుతో పిలుస్తూ, తనింటికి తీసు

శ్రీమతి జి. రామలక్ష్మి, హైదరాబాద్

కెళ్ళాడు. రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ గడవసాగాయి. లక్ష్మీకుమార్ రాజభోగంతో తులతూగుతున్నాడు. కూలీవాడు అందలమెక్కి ఏ కష్టం తెలవకుండా ఆనందంగా జీవితం గడుపుతున్నాడు. ఎటొచ్చీ జమిందారుకే ఆలోచనా, మనశ్శాంతీ లేకపోవటం జరిగింది. ఏ విధమైన ఆస్తీ, కోట్లూ, చివరికి లంకె బిందెల లాంటివేవీ అతనికి ఈ పిల్లాడివల్ల కలిసిరాలేదు.

''తన దురాశ తనకే చేటయిందా?'' అని అనుకుని, ఆ జ్యోతిష్కుని మీద పట్టరాని కోపం వచ్చింది. అతడ్ని వెతుక్కుంటూ మరీ అతని దగ్గరకు వెళ్ళి, ''దొంగ జ్యోతిష్యాలు చెప్తూ ప్రజలను మోసం చేయటమే కాక, నన్ను కూడా మోసం చేస్తావా?'' అని అరిచాడు. ''ఇప్పుడేమయిందని మీరంతలా కోపం తెచ్చుకుంటున్నారు? నేనన్నది అక్షరాలా జరిగింది. అందులో పొరపాటేంలేదు. అతనికీ - అతని తల్లిదండ్రులకూ గొప్పధనలాభం. 'అదృష్టం' రాజభోగం కలుగుతాయన్నాను. ఆ పిల్లాడికి ధనయోగం కలిగి, తద్వారా అతని తల్లిదండ్రులు సుఖిస్తారన్నాను; మరి అలా జరగలేదా? ఆ అబ్బాయికి సిరి తద్వారా వారి పెద్దలకు సుఖం మీ వల్లనే కలిగింది ఆనాటి నుంచే ఆలోచించండి. మీకే అర్థమవుతుంది. మీకు ధనయోగం అనలేదు ఆ పిల్లాడికి అన్నాను. అది వాడికి మీ వల్ల సంప్రాప్తించింది. లేకుంటే వారు ఎలాంటి నీచ స్థితిలో ఉన్నారో- మీరు ఆదుకునే నాటికి మీకు తెలుసు!'' అన్నాడు. జమిందారు ఆలోచించాడు.

''అవును, జ్యోతిష్కుడు అన్నదీ నిజమే! అతని జ్యోస్యం- నా దురాశ ద్వారా వారికి చెంగి, కరెక్ట్ అయింది. ఇందులో అతని తప్పేం ఉంది. ఇప్పుడు నోరుమూసుకునుండకపోతే, కష్టపడి పెంచుకున్న ఆ కుర్రాడిని వాడి తల్లిదండ్రులు తీసుకుపోగలరు. నాకు ఆ విధంగానూ మనశ్శాంతి కరువగలదు. వాళ్ళకేం వాళ్ళు రాజభోగం అనుభవిస్తున్నారు ఆనాటి నుంచి. ఇందులో ఎవరి తప్పు లేదు. నా 'దురాశే' అంతటికీ కారణం!'' అంటూ యింటి దారి పట్టాడు జమిందారు!!

